క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు

తుగ్గలి: మండల పరిధిలోని కోతికొండలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసును గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ముజావర్లు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మేళతాళాలతో గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. కులమతాలకతీతంగా గ్రామస్తులు దర్గాకు వెళ్లి చక్కెర చదివింపులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటాలు అలరించాయి. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

2 నుంచి సామాజిక తనిఖీ

తుగ్గలి: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో చేపట్టిన పనులకు 17వ రౌండ్ సామాజిక తనిఖీలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం తనిఖీ బృందాలకు ఉపాధి సిబ్బంది పనులకు సంబంధించిన రికార్డులు అప్పగించారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద మొత్తం రూ.25.65 కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు ఏపీఓ రామకృష్ణ తెలిపారు. వాటిలో కూలీలకు రూ.19.27 కోట్లు, మెటీరియల్‌కు రూ.6.38 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. జనవరి 2వ తేదీ నుంచి తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తాయన్నారు.

ప్రతి ఇంటికీ నంబర్ ప్లేట్

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ శాశ్వత నంబర్ ప్లేట్ అమరుస్తామని పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ తెలిపారు. ఇంటి నంబర్లు అమర్చే పనిని ప్రభుత్వం ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించిందని చెప్పారు. నంబర్ ప్లేట్ అమరిస్తే ప్రైవేట్ సంస్థ ప్రతినిధికి రూ.40 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వద్దనుకున్న వారికి వేయరన్నారు. ఆస్పరిలో 1500 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటికి నంబర్ ప్లేట్ వేయించుకోవాలని సూచించారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని శవం లభ్యం



హొళగుంద: హొళగుంద–గజ్జహళ్లి మధ్యలోని తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఏడు మోరీల బ్రిడ్జ్ వద్ద సుమారు 40 ఏళ్ల వ్యక్తి శవం నీటిలో ఉండడాన్ని గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు నీలం రంగు కట్ బనియన్, నీలం రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, గోధుమ రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వీఆర్‌ఓతో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

హుండీ కానుకల చోరీ

వెల్దుర్తి(కృష్ణగిరి): అల్లుగుండు ఆంజనేయ స్వామి ఆలయంలోని హుండీ కానుకలను దుండగులు చోరీ చేశారు. ఈనెల 29న ఉదయం గుడి తెరిచిన ధర్మకర్త గాలెన్న హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామస్తులతో కలిసి చుట్టుపక్కల వెతికారు. గ్రామ సమీపంలోని వంక వద్ద హుండీ పగులగొట్టి కనిపించింది. అందులో కానుకలు సుమారు రూ.10వేలు ఉంటాయని తెలిసింది. దీనిపై గాలెన్న శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

2 వేల హెక్టార్లలో పంట నమోదు

కృష్ణగిరి: మండలంలో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ నమోదు పక్కాగా చేస్తున్నామని, రబీ కింద ఇప్పటి వరకు 2 వేల హెక్టార్లలో పంట నమోదు చేశామని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పలు గ్రామాల్లో చేపడుతున్న ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రబీ సాధారణ సాగు 5వేల హెక్టార్లుగా ఉందన్నారు. పంట ఉత్పత్తులు అమ్ముకోవాలంటే నమోదు తప్పనిసరిగా ఉండాలని.. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. రైతులు పొలాల వద్దకు వస్‌బీ ఫారంతోపాటు, ఆధార్‌కార్డుతో వచ్చి సహకరించాలన్నారు.

ఎంఆర్సీకి గ్రంథాలయ పుస్తకాలు



గ్రంథాలయ పుస్తకాలతో ఎంఈఓ–2 రఘునాథ్

నందవరం: ప్రభుత్వ పాఠశాలలోని గ్రంథాలయాలకు పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ–2 రఘునాథ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో గ్రంథాలయ పుస్తకాలను ఎంఈఓ–2 పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా పాఠశాలకు 2వ తేదీ పుస్తకాలను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందించే గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాగుకు సాయం



- ఏటా రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు
- నాలుగున్నరేళ్లలో 5,306 కనెక్షన్లు
- నియోజకవర్గంలో మొత్తం అగ్రికల్చర్ కనెక్షన్లు 19,120
- సాగుకు 9 గంటల పగటిపూట విద్యుత్ సరఫరా
- అన్నదాతలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ఆలూరు రూరల్: పొలం ఉన్నా నీటి సౌకర్యం లేక చాలా మంది రైతులు వ్యవసాయం మానుకునే పరిస్థితి. పోని బోర్లు వేద్దామంటే విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియదు. రాత్రి పూట పొలాల వద్దే జాగారం చేయాల్సిన పరిస్థితి. ఇదంతా గతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపింది. దరఖాస్తు చేసిన రోజుల వ్యవధిలోనే కనెక్షన్లు మంజూరు చేస్తోంది. పగటి పూటే 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తోంది. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఆలూరు నియోజకవర్గంలోని రైతులకు 5,306 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసింది. 2019 నాటికి ఆలూరు మండలాల్లో 19,120 కనెక్షన్లు ఉండేవి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కనెక్షన్ల సంఖ్య 24,426కు పెరిగింది.

అడిగిన వెంటనే కనెక్షన్

రైతులకు ఇబ్బంది లేకుండా దళారులను ఆశ్రయించకుండా దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లోనే కనెక్షన మంజూరు చేస్తున్నారు. ప్రతి రోజు 9 గంటల పాటు నిరంతరాయంగా పగటిపూట విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. గత టీడీపీ పాలనలో రెండు పూటలు విద్యుత్ సరఫరా చేసేవారు. రాత్రి పూట పొలాలకు వెళ్లాలంటే రైతులు నానా ఇబ్బందులు పడేవారు. విషసర్పాల బారిన పడి కొందరు ప్రాణాలు వదిలితే.. రాత్రి పూట విద్యుత్ స్టార్టర్లు, ఫీజులు పెట్టే సమయంలో విద్యుత్ షాక్ తగిలి తనువుచాలించేవారు. నాలుగున్నరేళ్లుగా రైతులకు ఆ కష్టాలు తీరాయి.

వ్యవసాయం దండగన్న టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం రైతులకు నిర్లక్ష్యం చేసిందనేందుకు సాక్షాత్తూ అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలే ప్రత్యక్ష సాక్ష్యాలు. వ్యవసాయం దండగ అన్న బాబు అదే రీతిలో రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ తన తీరు ప్రదర్శించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ కోతలు భారీగా ఉండేవి. సమయానికి కరెంట్ వచ్చేది కాదు. దీంతో రైతులు పండించిన పంటలు చేతికందక అప్పుల్లో కూరుకుపోయారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కావాలంటే అంతే సంగతులు. కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం చేకూరేది కాదు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా దరఖాస్తుదారుల సీనియార్టీ మేరకు విద్యుత్ కనెక్షన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు అవుతున్నాయి.

ఆలూరు నియోజవర్గంలో 2019కు ముందు ఉన్న వ్యవసాయ కనెక్షన్లు: 19,120

2019 నుంచి 2023 నవంబర్ వరకు మంజూరు చేసిన విద్యుత్ కనెక్షన్లు

మండలం	గతంలో ఉన్న కనెక్షన్లు	నాలుగేళ్లలో ఇచ్చినవి	మొత్తం
ఆలూరు	1448	551	1,999
ఆస్పరి	2,239	495	2,734
చిప్పగిరి	542	495	1,037
హాలహర్వి	1,409	806	2,215
హొళగుంద	2210	1,304	3,515
దేవనకొండ	7,290	1,484	8,774



బోరు నుంచి పంటలకు పారుతున్న నీరు



ఆలూరులో వ్యవసాయ బోరు నుంచి వస్తున్న నీరు



వేరుశనగ పంటకు నీరు కడుతున్న రైతు

కష్టాలు తీరాయి



నేను పదేళ్లుగా 11 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాను. గతంలో రాత్రి 9 గంటలకు పొలానికి వెళ్లి నీళ్లు కట్టేవాడిని. గంటకోసారి విద్యుత్ కోతలు ఉండేవి. కరెంట్ ఎప్పుడు వస్తోందో..ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రాత్రంగా మేలుకొని పరుగు పుత్రతో భయపడతూ చేనుకి నీళ్లు కట్టే వాడిని. నాలుగున్నరేళ్లుగా ఇబ్బంది లేదు. రాత్రి పూట ఇంట్లో హాయిగా నిద్రపోయి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పొలంలో నీరుకట్టి ప్రశాంతంగా ఇంటికి వెళ్తున్నా. ఎలాంటి విద్యుత్ కోతలు లేవు.

–నాగరాజు, రైతు, తుంబళబీడు,

కరెంటు సమస్య లేదు



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. బోరు కింద వేశు శనగ పంట సాగు చేశాను. గతంలో రాత్రి పూట కరెంటు ఉండేది. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. రాత్రంతా పొలంలో కావలి కాయాల్సి వచ్చేది. ఇప్పుడు పగటి పూట కరెంట్ పోవడం లేదు. పొద్దున్నే 8 గంటలకు చేనుకు వస్తున్నాను. మధ్యాహ్నం అన్నం తినే టైంకు ఇంటికి పోతున్నా.

–తిరుమలేష్, రైతు, ఆలూరు

దరఖాస్తు చేసిన వెంటనే కనెక్షన్



ఏడాది క్రితం నాకున్న 2.5 ఎకరాల పొలంలో బోరు వేసుకున్నాను. ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.6,250 చెల్లించి దరఖాస్తు చేసుకున్నాను. నాకు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. స్తంభాలు, విద్యుత్ పరికరాలు ఉచితంగా అందించారు. రూ. 86 వేలు ఖర్చు అయ్యింది. రూ.50 వేలు సబ్సిడీ పోగా మిగిలి మొత్తాన్ని చెల్లించాను. ఇప్పుడు సంతోషంగా ఉన్నాను. ఇలాంటి ప్రభుత్వం ఉంటే రైతులు బాగుపడుతారు.

–లక్ష్మన్న, రైతు, అరికెర గ్రామం

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన రామలింగం

వెల్దుర్తి(కృష్ణగిరి): వాకింగ్‌కు వెళ్లి వస్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో గాయపడిన ఘటన వెల్దుర్తిలో జరిగింది. పట్టణానికి చెందిన రామలింగం రామళ్లకోట రోడ్డులో శనివారం ఉదయం వాకింగ్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో బోయనపల్లెకు చెందిన ధను బైక్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొన్నాడు. రామలింగానికి గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెల్దుర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బైకిస్టుకు సైతం స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. రామలింగం పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్‌ఐ

నందవరం: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో వాహనాల తనిఖీలు చేపట్టామని చెప్పారు. అదే గ్రామానికి చెందిన ఈడిగ తిమ్మప్ప కర్ణాటక మద్యం విక్రయిస్తుంగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని నుంచి 96 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వ్యక్తిగత విమర్శలు తగవు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప

హాలహర్వి: టీడీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైఎస్సార్‌సీపీ నేత రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. హాలహర్విలో సీసీరోడ్డు నిర్మాణం విషయంపై టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరిపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు, అవినీతికి ఆస్కారం లేకుండా పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. మండలంలో సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. టీడీపీ నాయకులకు అక్రమాలు, అవినీతి చేయడం.. ఎదుటి వారిపై బురద జల్లడం అలవాటేనని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, మాజీ ఎంపీపీ బసప్ప, నిత్రవట్టి లక్ష్మన్న, రాజా, హరి పాల్గొన్నారు.

సామాన్యులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు



పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

పత్తికొండ రూరల్: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. సామాన్యులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత అన్ని దుకాణాలు మూసివేయాలన్నారు. జనం గుంపులుగా ఉండరాదన్నారు. రాత్రి వాహనాల తనిఖీ చేపడతామని ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే, బైపాస్ రోడ్డులో బైక్‌రేస్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాల్లో వేడుకలు నిషిద్ధమని తెలిపారు. రాత్రంతా పోలీసు గస్తీ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

–వెల్దుర్తి, కృష్ణగిరి: నూతన సంవత్సరం పేరుతో సామాన్యుల స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని వెల్దురి, కృష్ణగిరి ఎస్‌ఐలు చంద్రశేఖర్ రెడ్డి, సురేశ్ హెచ్చరించారు. సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం

గోనెగండ్ల: డిసెంబర్ 31 రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. రోడ్డుపై గుంపులుగా సమావేశం అవ్వడం, తిరగడం చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించరాదన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ

నందవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు, హౌసింగ్ సిబ్బందికి హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ ప్రసాద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని పేర్కొన్నారు. మండలంలో జనవరి 15వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో బీఎల్ దశలో 158, ఎల్ఎల్ దశలో 4, ఆర్ఎల్ లెవల్‌లో 40, ఆర్సీ దశలో 4 గృహాలు ఉన్నాయని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు సకాలం చెల్లిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వాల్మీకి యువ గర్జన పోస్టర్ల ఆవిష్కరణ

పత్తికొండ రూరల్: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం జనవరి 20న కర్నూలులో నిర్వహించనున్న వాల్మీకి యువగర్జన వాల్‌పోస్టర్లను వాల్మీకి యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంపల్లి సూరన్న, రాష్ట్ర నేత వినోద్‌కుమార్ విడుదల చేశారు. శనివారం స్థానిక రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సోమశేఖర్, రామక్రిష్ణ, కడవల సుధాకర్, గోవిందు, రామనాయుడు, మునినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న వాల్మీకులు

నాడు శిథిలం.. నేడు కమ్యూనిటీ హాలు



నాడు–శిథిలావస్థలో ఉన్న ఉర్దూ స్కూలు



నేడు– కమ్యూనిటీ హాలు నిర్మాణం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో మైనార్టీ విద్యార్థుల కోసం 15 ఏళ్ల క్రితం ఉర్దూ పాఠశాల నిర్మాణం చేపట్టారు. అయితే మధ్యలోనే నిలిచిపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వాలు మారాయి కానీ నిర్మాణం పూర్తి కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు మైనార్టీలు ఆమెను కలిసి సమస్య తెలియజేశారు. ఆ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరడంతో జిల్లా అధికారులతో మాట్లాడి రూ.30 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి.

కుష్టు రోగులకు కిట్లు పంపిణీ

మద్దికెర: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కుష్టు రోగులకు శనివారం పోషక పదార్థాలు కలిగిన కిట్లను వైద్యాధికారిణి రాగిణి పంపిణీ చేశారు. చర్మంపై స్పర్శలేని రాగి మచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, సూర్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి రాగిణి

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల ఎంపిక

పత్తికొండటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం శనివారం పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల నూతన కమిటీలను ప్రకటించింది.

1.మద్దికెర మండలం

అధ్యక్షుడు – గంపల వెంకటేశ్వర్లు
ఉపాధ్యక్షులు– క్రిష్ణయాదవ్, ఎ.గోపాల్,
ప్రధాన కార్యదర్శులు– ప్రభుదాసు, నరసింహారెడ్డి, శివరంగడు
కోశాధికారి–సంజప్ప
కార్యదర్శులు–5, కార్యవర్గ సభ్యులు–15 మంది

2.క్రిష్ణగిరి మండలం

అధ్యక్షుడు – ఆర్‌బీ వెంకటరాముడు
ఉపాధ్యక్షులు– వెంకటేశ్వర్లు, రామకృష్ణ
ప్రధాన కార్యదర్శులు –క్రిష్ణమూర్తి, చెన్నయ్య, ఉమర్‌బాషా
కోశాధికారి– సుధాకర్‌రెడ్డి
కార్యదర్శులు– 5, కార్యవర్గ సభ్యులు–15 మంది

3.వెల్దుర్తి మండలం

అధ్యక్షుడు – బి.రవీంద్రనాథ్‌రెడ్డి (రవిరెడ్డి),
ఉపాధ్యక్షులు – సూర్యనారాయణ, రాధాకృష్ణరెడ్డి
ప్రధానకార్యదర్శులు – వెంకటనాయుడు, రామ్‌గోపాల్, సురేంద్రనాథ్‌రెడ్డి
కోశాధికారి – సీతారాముడు
కార్యదర్శులు –5, కార్యవర్గసభ్యులు–15 మంది

4.పత్తికొండ మండలం

అధ్యక్షుడు – కారం నాగరాజు
ఉపాధ్యక్షులు – అంజినయ్య, రామన్న
ప్రధాన కార్యదర్శులు – నరసింహుడు, షరీఫ్, బాలరాజు
కోశాధికారి – సహదేవుడు
కార్యదర్శులు – 5, కార్యవర్గసభ్యులు–15 మంది

5.తుగ్గలి మండలం

అధ్యక్షుడు – జిట్టా నాగేష్‌యాదవ్
ఉపాధ్యక్షులు – లింగన్న, సత్యనారాయణ,
ప్రధాన కార్యదర్శులు – లక్ష్మి, హారిక, రాచప్ప,
కోశాధికారి – అట్ల గోపాల్‌రెడ్డి,
కార్యదర్శులు – 5, కార్యవర్గ సభ్యులు 15 మంది

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ రహిమాన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ సర్పంచ్ ముజుబుర్ రహిమాన్ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. గుంతకల్లు రైల్వే గ్రౌండ్స్‌లో క్రికెట్ కోచ్‌గా ఉన్న సర్పంచ్ కుమారుడు అమీర్ నెల క్రితం మృతి చెందారు. దీంతో పత్తికొండలోని బండిగేరిలో ఉన్న సర్పంచ్ ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఈమె వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న క్రీడా పోటీలు

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం మండలంలోని నగరడోణ, రామదుర్గం, ఏరూరు, గుమ్మనూరు గ్రామాల్లో కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న పర్యవేక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వెల్దుర్తి(కృష్ణగిరి): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ రామస్వామి అన్నారు. మండల పరిధిలోని లక్కసాగరం, ఎస్‌హెచ్ ఎర్రగుడి, పోతుగల్లు గ్రామాల్లో జరిగిన క్రీడా పోటీలను ఆయన పర్యవేక్షించారు. పోతుగల్లు గ్రామంలో సర్పంచ్ తెలుగు వాణిశ్రీ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.

–**గోనెగండ్ల:** గోనెగండ్లతో పాటు కులుమాల, పెద్దనేలటూర్, పెద్దమరివీడు, గంజిహళ్లి గ్రామాల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోనెగండ్ల, గంజిహళ్లిలో క్రీడాపోటీలను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఈఓఆర్డీ నాగేష్ పర్యవేక్షించారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఈ పోటీలు ఉపయోగపడుతాయని తెలిపారు.

–**మద్దికెర:** మండల కేంద్రంలోని జరిగిన పోటీలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పరిశీలించారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

–**హాలహర్వి:** మండలంలోని నిత్రవట్టి, అర్దగేరి సచివాలయాల పరిధిలో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ ఆంటోని, తహసీల్దార్ మల్లికార్జున ప్రారంభించారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, బిలేహాల్ సర్పంచ్ ఉలిగప్ప పాల్గొన్నారు.

–**నందవరం:** గ్రామీణ స్థాయిలో క్రీడకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు.



నందవరం జెడ్పీ పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన క్రీడా పోటీలను వారు పర్యవేక్షించారు. మండలంలో కబడ్డీ 7 మ్యాచ్‌లు, ఖోఖో 6 మ్యాచ్‌లు, వాలీబాల్ 3, బాడ్మింటన్ 27 మ్యాచ్‌లు నిర్వహించామని తెలిపారు.

–**హొళగుంద:** హొళగుంద, ఎల్లార్తి, లింగంపల్లి గ్రామాల్లో క్రికెట్ పోటీలు ఉల్లాసంగా జరిగాయి. ఎంపీడీఓ సుభాషిణి, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ టాస్ వేసి ప్రారంభించారు.



మద్దికెర: ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు



హాలహర్వి: బిలేహాల్‌లో క్రికెట్ పోటీలు



గోనెగండ్ల: పెద్దనేలటూర్‌లో ఖోఖో

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

హొళగుంద: విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మల్లికార్జున అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, గాది, పంపా, పవన్ పాల్గొన్నారు.